క్లుప్తంగా

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి


ప్యాలకుర్తి సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్ : గ్రామ సచివాలయ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజల సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కార మార్గాలు చూపాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామ సచివాలయాలను శుక్రవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఉద్యోగులు హాజరు, మూమెంట్ తదితర రిజిస్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

పండ్ల తోటల పరిశీలన

అనంతరం ఎంపీడీఓ చంద్రశేఖర్ ఉపాధి ఏపీఓ రమాదేవితో కలిసి ప్యాలకుర్తి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రైతులు సాగు చేసిన పండ్ల తోటలను పరిశీలించారు. నాటిన పండ్ల మొక్కలను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఎంపీడీఓ రైతులకు సూచించారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ


ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరాముడు

కర్నూలు (న్యూటౌన్): ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు బీఎల్ఓలను ఆదేశించారు. కర్నూలు నగర శివారులోని మునగాలపాడులో ఓటరు జాబితాపై జరుగుతున్న ఇంటింటి సర్వేను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ ఎంట్రీలు, డిలీషన్లను ఓటరు జాబితా నుంచి తొలగించడానికి పక్కా ఆధారాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మునగాలపాడు వీఆర్ఓ మద్దిలేటి, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులు నాణ్యతగా చేపట్టాలి


జెడ్పీ హైస్కూల్ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎస్ఈ నాగేశ్వరరావు

సి.బెళగల్: మనబడి నాడు – నేడు రెండవ విడతలో భాగంగా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఆయన కర్నూల్ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏడుకొండలుతో కలిసి మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పర్యవేక్షణ, నిర్మాణ లోపాలపై సంబంధిత అధికారులపై మండిపడ్డారు. పనులలలో నాణ్యతలు లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ నిఖిల్, టీచర్లు, గ్రామస్తులు ఉన్నారు.

'సుంకేసుల'కు వరద నీరు


సుంకేసుల జలాశయం

గూడూరు: తుంగభద్ర నదీతీర ప్రాంతాలలో భారీగా వర్షాలు కురవడంతో సుంకేసుల జలాశయం కళకళలాడుతుంది. ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం జలాశయానికి 4,311 క్యూసెక్కుల నీరు చేరినట్లు డ్యామ్ అధికారులు పేర్కొన్నారు. డ్యామ్‌కు చెందిన ఒక గేట్‌ను మీటర్ మేర ఎత్తి 4, 311 క్యూ సెక్కులను శ్రీశైలం వైపు మళ్లించామన్నారు. జలాశయం కేపాసిటి 1.20 టీఎంసీ కాగా ప్రస్తుతం 1.026 టీఎంసీల నిల్వ ఉందని, మరింత వరద నీరు చేరే అవకాశం ఉందని వారు తెలిపారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

ఓర్వకల్లు: మండల పరిధిలోని గుమ్మితం తండా వద్ద గల ఎగ్జిక్యూటీవ్ క్యాంప్‌లో పని చేస్తున్న వ్యక్తి నీటి కుంటలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, వనపర్తి జిల్లా, పనుగాల్ మండలం, తెల్లరాళ్లపల్లె గ్రామానికి చెందిన కెతావత్ బాల్య కొడుకు రాజు(30) గోడ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పనిచేస్తుండగా మూర్ఛవ్యాధి రావడంతో మాద వశాత్తు ప్రక్కనే ఉన్న నీటి కుంటలో పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఆ మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృత దేహానికి పోస్టు మార్టం నిర్వహించామన్నారు. మృతునికి భార్యతో పాటు, ఇద్దరు కు మార్తెలు, కుమారుడు ఉన్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

ఊపందుకున్న ఉల్లి సాగు!

- వర్షాల రాకతో మొగ్గు చూపుతున్న రైతులు
- వెంకటగిరిలోనే రెండువేల ఎకరాల్లో ఉల్లి
- ఒక్కసారిగా నారుకు పెరిగిన డిమాండ్
- కూలీలు సైతం దొరకని వైనం


భారీగా ఉల్లి నాట్లు వేస్తున్న కూలీలు

కోడుమూరు రూరల్ : వరుణ దేవుడు కరుణించడంతో ఖరీఫ్ సాగు హుషారుగా సాగుతుంది. ప్రత్యేకించి ఉల్లిసాగు ఊపందుకుంది. వాతారణ పరిస్థితుల మూలంగా రెండేళ్లుగా సరైన గిట్టుబాటు ధరలేక ఉల్లి రైతులు నష్టపోయారు. దీంతో ఈ ఏడాది ఉల్లి సాగు చేయరాదని రైతులు నిర్ణయం తీసుకున్నారు కూడా. ఇటీవల తుపాన్ ప్రభావంతో ఉత్తరాది రాష్ట్రాల్లో భారీగా పంటలు దెబ్బతినడం, మార్కెట్లో ఉల్లి రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో రైతుల నిర్ణయం మారింది. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, దేవనకొండ, ఆలూరు, ఆస్పరి, మద్దికెర, కోసిగి, తుగ్గలి ప్రాంతాల్లో బోరు బావులతో పాటు, వర్షాధారం కింద రైతులు జోరుగా ఉల్లి పంట సాగు చేపట్టారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు జోరుగా ఉల్లి నాట్లు వేస్తున్నారు. గతేడాది కోడుమూరు నియోజకవర్గంలో 6వేల ఎకరాలకుపైగా ఉల్లి సాగు చేయగా, ఈ ఏడాది విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు అధికారులు.

ఉల్లి నారకు పెరిగిన డిమాండ్

ఒక్కసారిగా రైతులంతా ఉల్లి సాగువైపు మొగ్గు చూపుతుండడంతో నారుకు భారీగా డిమాండ్ ఏర్పడింది. రెండు వారాల కిందటి వరకు రూ.1500 పలికిన ఉల్లి బెడ్డు ప్రస్తుతం రూ.2500 నుంచి రూ.3000ల వరకు పలుకుతోంది. అయినప్పటికీ రైతులు పోటీపడి ఉల్లి నారును కొనుగోలు చేస్తున్నారు. ఎకరాలో ఉల్లి నాటు కోవాలంటు సుమారు 4నుంచి 5బెడ్ల వరకు రైతుకు నారు అవసరం అవుతుంది. అయినా ఖర్చుకు వెనుకాడకుండా ధైర్యం చేస్తున్నాడు అన్నదాత.

కూలీలకు భారీగా పెరిగిన డిమాండ్

ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు లేక పనుల కోసం ఎదురు చూసిన వ్యవసాయ కూలీలు ఇప్పుడు దొరకడం లేదు. ప్రత్యేకించి ఉల్లి సాగు ఊపందుకోవడంతో కూలీలకు మంచి డిమాండ్ పెరిగింది. ఒక రోజు కూలి రూ.300ల నుంచి రూ.350ల వరకు డిమాండ్ చేస్తున్నారు కూలీలు. అయినా అనుకున్న సమయానికి కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. కూలీల డిమాండ్ మేరకు కూలి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.


ప్యాలకుర్తి వద్ద బోర్ల కింద పోసిన ఉల్లి నారు

వెంకటగిరిలో భారీగా ఉల్లి సాగు

జిల్లాలోనే అత్యధికంగా కోడుమూరు మండలంలోని వెంకటగిరి గ్రామంలో వర్షాధారం కింద రైతులు ఉల్లి పంటను సాగు చేస్తున్నారు. ఈ గ్రామంలో వారం రోజుల్లో 2,000 ఎకాలకుపైగా ఉల్లి పంటను పోటీపడి సాగు చేస్తున్నారు. దీంతో కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కోడుమూరుతో పాటు చుట్టు పక్కల మండలాలకు చెందిన వందలాది కూలీలు వెంకటగిరిలో నాట్లు వేసేందుకు తరలివస్తున్నారు.

15 ఎకరాల్లో ఉల్లి సాగు



వర్షాధారం కింద గత రెండు రోజుల్లో 15ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. ఉల్లి పంట సాగుకు ఎకరాకు ఉల్లి నార, కూలీలతో కలిపి సుమారు రూ.20వేల వరకు ఖర్చు చేశా. గతేడాది కూడా 19ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసి నష్టపోయా. ఈ ఏడాదైన ఉల్లి సాగుతో లాభాలు వస్తాయని ఆశిస్తున్నా. – రైతు మహేశ్వరరెడ్డి, వెంకటగిరి

ఉల్లి సాగుకు మొగ్గు చూపుతున్నారు



ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో ఎక్కువ మంది రైతులు వర్షాధారం, బోరుబావుల కింద ఉల్లి పంట సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో సుమారు 5వేలకు పైగా ఎకరాల్లో రైతులు ఉల్లి సాగు చేస్తున్నారు. సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.

– మదన్ మోహన్, హార్టికల్చర్ ఆఫీసర్, కోడుమూరు

బ్రిడ్జిపై గుంతలకు మరమ్మతులు చేయాలి

కల్లూరు: మండల పరిధిలోని పెద్దపాడు దగ్గర ఉన్న వక్కెర వాగు బ్రిడ్జిపై పడిన గుంతల మూలంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం బృందం బ్రిడ్జిని, రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ బ్రిడ్జిపై గుంతలు పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ తీసుకుని బ్రిడ్జిపై పడిన గుంతలను తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. నాయకులు రాధాకృష్ణ, గురుశేఖర్ పాల్గొన్నారు.

రేపు టీటీడీ కథల పోటీలు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో దేశ భక్తి, దైవ భక్తి, సనాతన భారతీయ విలువలు, వ్యక్తిత్వ వికాసంతో పాటు వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'కథ చెబుతారా ఊ కొడతాం' అనే శీర్షికతో పోటీలు నిర్వస్తున్నట్లు పేర్కొన్నారు. 30వ తేదీ ఉదయం 9 గంటలకు నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని శ్రీసుధ విద్యాలయంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. 5 నిముషాల లోపు కథా సమయం ఉంటుందని పేర్కొన్నారు. పదేళ్ల లోపు బాలబాలికలు ఒక విభాగంగా, 10 నుంచి 15 ఏళ్ల లోపు వారికి మరో విభాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేయండి


అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమైన జెడ్పీసీఈఓ నాసరరెడ్డి

సి.బెళగల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోనుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మండలంలో జరిగిన, జరగాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. మండలానికి జమ అయిన నిధులు, ఖర్చులు, పనుల కేటాయింపు తీరును ఎంపీడీఓ, ఈఓఆర్డీలను సీఈఓ అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ప్రజల అవసరాల మేరకు పనులు చేసేందుకు అవరోధాలున్నట్లు మండల అధికారులు అంటున్నారని, పరిష్కార మార్గం చూపాలని ఈ సందర్భంగా ఎంపీపీ సీఈఓను కోరారు.

ఘనంగా మధ్య సరిగెత్తు


పాణ్యంలోని అల్వార్ స్వామిని పురవీధుల గుండా ఊరేగిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంతోపాటు గ్రామాల్లో మధ్యసరిగెత్తు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పీర్ల దేవుళ్ల ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య సాగింది. డమ్ములు, మేలతాళాలు, యువకుల నత్యాల మధ్య అంగరంగ వైభవంగా పీర్లను ఊరేగించారు. కులమతాలకు అతీతంగా భక్తులు పీర్లదేవుళ్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు మొక్కుబడుల్లో భాగంగా వెండి గొడుగులు బహూకరించారు.


కరిమద్దెల గ్రామంలో పీర్లను తిలకిస్తున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రం గడివేములతోపాటు గ్రామాల్లో శుక్రవారం మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చావిడిలలో కొలువైన పీర్ల దేవుళ్లను కులమతాలకు అతీతంగా భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కొందరు చెక్కర చదివింపులు చేయగా మరికొందరు పూల దట్టీలు, వెండి గొడుగులు సమర్పించారు.

31న జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో స్పందన

కోడుమూరు రూరల్ : ఈనెల 31వతేదీ సోమవారం కర్నూలులో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే స్పందన కార్యక్రమాన్ని సునయన ఆడిటోరియంలో కాకుండా కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు కోడుమూరు తహసీల్దార్ జయన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలపై స్పందన కార్యక్రమంలో అర్జీలిచ్చేందుకు వెళ్లే మండల ప్రజలు స్థల మార్పును గమనించి జిల్లా పరిషత్ సమావేశ భవనానికి వెళ్లాలని తహసీల్దార్ సూచించారు.

కర్నూలు(న్యూటౌన్) : ఈనెల 31వ తేదీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం ఉంటుందని కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పిస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడి


నవధాన్యాల పంటను పరిశీలిస్తున్న డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి.

కల్లూరు: నవధాన్యాల సాగు విధానంతో పంటలలో దిగుబడి పెరుగుతుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి అన్నారు. శుక్రవారం కర్నూలు నగర శివారులోని గాయత్రి గోశాలలో సాగు చేసిన నవధాన్యల పంటను, చిన్నటేకూరులో కందిలో అంతర పంటగా సాగు చేసిన కొర్రను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఏబీ చైర్మన్ మాట్లాడుతూ నవధాన్యల సాగు నుండి వచ్చిన మేతతో గోవులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఘన జీవామృతం, ద్రవజీవామృతం తయారీ విధానం, 20 నుంచి 30 రకాల విత్తనాలను వాడటం కలిగే లాభాల గురించి తెలియజేశారు. వరలక్ష్మి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటల సాగుకు అనువైన వాతావరణాన్ని ఏర్పరచడానికి నవధాన్యాల సాగు విధానం పాటించాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, టెక్నికల్ వ్యవసాయాధికారి దస్తగిరి రెడ్డి, ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షిత కాన్పులు


బాలింతకు వైద్య పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్

గడివేముల: ప్రభుత్వ ఆసుపత్రిలోనే మహిళలకు సురక్షితమైన కాన్పులు జరుగుతాయని గడివేముల వైద్యాధికారి డాక్టర్ మొల్ల జబీన్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బిలకల గూడూరు గ్రామానికి చెందిన తబిత సాధారణ కాన్పులో ఆడపిల్లకు జన్మనిచ్చింది. డాక్టర్ మొల్ల జబీన్ మాట్లాడుతూ ఎలాంటి ఆపరేషన్ అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పు జరిగిందనీ, ఇలా చాలా మందికి సాధారణ కాన్పులే జరుగుతాయని పేర్కొన్నారు. మహిళలు ప్రసవాల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి డబ్బులను వథా చేసుకోవద్దని సూచించారు. అనంతరం తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనం ద్వారా సురక్షితంగా ఇంటికి పంపినట్లు డాక్టర్ తెలిపారు.

నేడు జగనన్న సురక్ష

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం రేమట, ఆర్‌కే దుద్యాల గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అజాంఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్ హాజరవుతారన్నారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా పాల్గొనాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: పార్టీలు, కులమతాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బస్తిపాడు మజార గ్రామం చిన్నకొట్టాలలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే కాటసాని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో నూతనంగా రూ. 36లక్షలతో నిర్మించి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కాటసాని గ్రామంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలో ఎవైన సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. సమస్యలు పరిష్కరించాడానికి ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయా సమస్యలను సకాలంలో పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా ప్రభావంతో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్న పేద ప్రజల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు కొనసాగించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామిల్లో 98శాతం అమలు చేశామన్నారు. గత టీడీపీ పాలనకు ఈ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలని ప్రజలను కాటసాని కోరారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, సర్పంచ్ రవి, ఎంపీటీసీ నాగేశ్వరరావు, నాయకులు చింతారెడ్డి, సత్యంరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విమానాశ్రయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

- కలెక్టర్ డాక్టర్ సృజన


ఎయిర్ పోర్టు పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

ఓర్వకల్లు: విమానాశ్రయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాల్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ కృష్ణకాంత్ హాజరయ్యారు. విమానాశ్రయం పరిసరాల్లో చెత్తా చెదారం లేకుండా, పశువులు, పక్షులు రాకుండా చర్యలు తీసుకోవాలని పర్యావరణ నిర్వహణ కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. విమానాశ్రయ పరిసరాల్లో మైనింగ్ నిమిత్తం పేలుళ్లు జరపకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించాలని మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు సూచించారు. విమానాశ్రమ పరిసరాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓను ఆదేశించారు. విమానాశ్రయ అవసర నిమిత్తం 36 ఎకరాల స్థలం పెండింగ్‌లో ఉందని డైరెక్టర్ తెలుపగా, వెంటనే వారికి స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు సూచించారు. పోలీసులు బందోబస్తును పటిష్టంగా నిర్వహించి విమానాశ్రయ భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను ఆదేశించారు. 2021–2023 జూన్ వరకు దాదాపుగా 80,312 మంది ప్రయాణికులు విమాన సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. అనంతరం విమానాశ్రయంలో రన్‌వే, సరిహద్దు ప్రాంతాలను పరిశీలించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, విమానాశ్రయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కృష్ణయ్య, డీసీఐఓ మధుసూదన్, మైనింగ్ డీడీ రాజశేఖర్, డీఎంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్య, డీపీఓ నాగరాజు నాయుడు, డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రమేష్, తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఇండిగో విమాన సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

సి.బెళగల్: మొహర్రం వేడుకలను మండల ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సి.బెళగల్ ఎస్ఐ పీరయ్య సూచించారు. శుక్రవారం ఆయన గ్రామాలలోని పీర్ల చావిడీల దగ్గర ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ ఎవరైన అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గూడూరు: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో జూలకల్లు గ్రామ శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. నుంచి రూ.1,00,400, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆడిట్ సక్రమంగా చేయాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డీవీఓ సిద్దలింగమూర్తి

గూడూరు: మండలంలో ఉపాధి హామీ పథకం 17వ విడత సోషల్ ఆడిట్ సక్రమంగా నిర్వహించాలని డీవీఓ సిద్దలింగమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, సోషల్ ఆడిట్‌కు వచ్చిన సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ముందుగా గ్రామ స్థాయిలో ఆడిట్ నిర్వహించి సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి నివేదికలు చదవాలన్నారు. అనంతరం మండల స్థాయిలో ఆడిట్ నివేదికలు సమర్పించాలన్నారు. పకడ్బందీగా గ్రామ స్థాయిలో షోషల్ ఆడిట్ నిర్వహించాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవీలత, ఏపీఓ రామేశ్వరమ్మ, పీఆర్ ఏఈ గోపాల్‌రావ్, ఎస్ఆర్పీలు, డీఆర్పీలు పాల్గొన్నారు.

బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి


పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ఓర్వకల్లు: న్యాయం కోసం పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితుల పట్ల మార్యదపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పోలీసులకు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు అన్ని వేళల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట కర్నూలు సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ రాజారెడ్డి ఉన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు


లబ్ధిదారుడికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం జి శింగవరం, నిడ్జూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమానికి కర్నూలు ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్నూలు ఎంపీపీ మాట్లాడుతూ దేశం మొత్తంమీద ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి సమస్య అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అధికారులతో కలిసి ఆమె అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు మండల స్పెషల్ ఆఫీసర్ ఫాతిమా బీ, కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు, ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సత్యంరెడ్డి, సర్పంచ్ మాధవి, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, సంపత్‌కుమార్, ప్రసాద్, పీఏసీలు గోవింద్, బషీరున్‌బీ తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: సుపరిపాలనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కరిమద్దెల, కొత్రపాలూరు గ్రామాలలోని సచివాలయాల వద్ద శుక్రవారం అధికారులు జగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ సుంకన్న, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి తదితరులతో కలిసి ఆయన ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం హజరత్, ఏఈలు భాస్కర్, పవన్, మూర్తి, వీఆర్వో వెంకటలక్ష్మి, ఈఓఆర్డీ ఖాలీక్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, దేవేంద్రర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ డాలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం ముగిసింది. తహసీల్దార్, ఎంపీడీఓ రెండు టీమ్‌లుగా ఏర్పాటు చేసుకు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. వేల మందికి ఉచితంగా సర్టిఫికెట్లు అందించారు. ఎన్నడు లేని విధంగా అధికారులు ప్రజల వద్దకే వచ్చి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కొత్తూరులో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దస్తగిరి, మండల కన్వీనర్ గుద్దేటి సుమంత్‌రెడ్డి, సర్పంచ్ బీరం రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీదేవి, నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అదేవిధంగా సుగాలిమెట్టులో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఈఓఆర్డీ భాస్కర్ రావు, సర్పంచ్‌లు ఎల్లక్రిష్ణయ్య, దేవిబాయ్ ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.